నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 6 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ప్రజలతో మమేకమై పని చేయాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 5 : ప్రజా ప్రతినిధుల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ప్రత్యేకాధికారులు ప్రజలతో మమేకమై పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి అన్ని మండలాల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో ఆ స్థానంలో నియమించబడ్డ అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే కృషి చేయాలని సూచించారు. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకు అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై చర్యలు

నిర్వాహకులతో మాట్లాడుతున్న రాష్ట్ర బృందం సభ్యులు

మంచిర్యాల అర్బన్, జూలై 5: నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ రాజేశం, వసుప్రసాద్, జయచందర్ పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని పలు ప్రైవేట్ దవాఖానలను జిల్లా వైద్యాధికారి అనితతో కలిసి సందర్శించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం జిల్లాలో ప్రైవేట్ దవాఖానలు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు, రిజిస్టర్ చేసుకోవాలని, వీటిని పర్యవేక్షించడానికి రాష్ట్రంలో ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 245 ప్రవేట్ హాస్పిటల్స్ పెసిలిటీస్, 12 ఆయుష్ కింద రిజిస్టర్ చేయించుకున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొని వారు వెంటనే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయ్‌లెన్స్ అధికారి డాక్టర్ ఫయాజ్, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు

ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు

# అడ్డుకొని.. అరెస్టులు చేసి..

- టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి భగ్నానికి పోలీసుల యత్నం
- పోలీస్‌స్టేషన్‌లకు విద్యార్థి సంఘాల నాయకుల తరలింపు
- ఖాకీల తీరుపై ఆగ్రహం
- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్

కోటపల్లి : బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

జన్నారం : పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

మంచిర్యాల, జూలై 5, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరుద్యోగ జేఏసీ టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వగా, పోలీసు సిబ్బంది భగ్నం చేసేందుకు అడుగడుగునా అడ్డుకున్నది. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి హైదరాబాద్‌కు పయనమైన విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించగా, వారిలో ఆగ్రహం వ్యక్తమైంది. పలుచోట్ల నేతలు నిరాహార దీక్షలు చేపట్టి, సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం కనిపించింది. గ్రూప్ పోస్టుల సంఖ్య పెంచాలని, గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి పాటించాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, మెగా డీఎస్సీ ఇవ్వాలని, జీవో 46 రద్దు చేయాలని, నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

హాజీపూర్, జూలై 5 : హాజీపూర్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపెల్లి తిరుపతి, నాయకుడు అలిశెట్టి కోరి, బీజేవైఎం నాయకుడు ఆరెందుల రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు.

నస్పూర్, జూలై 5 : నస్పూర్‌లో విద్యార్థి సంఘాల నాయకులు వంశీ, ఆంజనేయులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు.

తాండూర్, జూలై 5 : తాండూర్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, తెలంగాణ నిరుద్యోగ ఫోరం(టీఎన్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మండల అధ్యక్షుడు మామిడి విగ్నేష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శులు గుండా బాలకృష్ణ, అడ్వాల సతీశ్, మండల కార్యదర్శి ఎలిగేటి నరేశ్‌లను గురువారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

చెన్నూర్ టౌన్, జూలై 5 : చెన్నూర్‌లో గురువారం అర్ధరాత్రి బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు ఎండీ నాయబ్, కొప్పుల రవీందర్, ఎనగందుల ప్రశాంత్, పొగాకు కిరణ్, చినాల ప్రశాంత్ రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ శ్రీపాల్, నాయకులు తుమ్మ చిరంజీవిని పోలీసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, వారు అందులోనే నిరాహార దీక్ష చేపట్టారు. అక్రమ అరెస్టులు సరికాదని, కాంగ్రెస్ సర్కారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

శ్రీరాంపూర్, జూలై 5 : శ్రీరాంపూర్‌లో టీబీఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏఐఎస్సీ జిల్లా కన్వీనర్ సన్నీ గౌడ్, యువజన నాయకులు రాగిడి రాజును గురువారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 5 : ఆసిఫాబాద్‌లో విద్యార్థి సంఘం నాయకులు జగజంపుల తిరుపతి, ఆత్మకూరి చిరంజీవి, అవిడపు ప్రణయ్ కుమార్, ప్రశాంత్, అయ్యుబ్ ఖాన్, నాగరాజు, గడ్డల ప్రణయ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

జన్నారం, జూలై 5 : మండలంలోని పలు పార్టీలకు చెందిన ఐదుగురు నిరుద్యోగ సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముడుగు ప్రవీణ్, చంద్రశేఖర్, పవన్, మనీశ్,నితిన్ ఉన్నారు.

### విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్

మందమర్రి, జూలై 5: హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ఎదుట ఉద్యోగాల నోటిఫికేషన్‌ల కోసం నిర్వహించిన ధర్నాను విఫలం చేసేందుకు పోలీసులు విద్యార్థి, నిరుద్యోగుల సంఘాల నాయకులను మందస్తు అరెస్ట్ చేశారు. మందమర్రి పోలీసులు అర్ధరాత్రి నాయకుల ఇండ్లపై దాడులు చేసి అదుపులోకి తీసుకుని ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్నారు. బీఆర్ఎస్‌వై పట్టణ అధ్యక్షుడు భట్టు రాజ్‌కుమార్, టీజేఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అభిరాంలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని అన్నారు. శాంతియుతంగా నిర్వహించే ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

కోటపల్లి, జూలై 5 : హైదరాబాద్‌కు బయలుదేరిన బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్‌ను గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకోని కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### నిరుద్యోగుల అరెస్ట్‌ను ఖండించిన బాల్క సుమన్

ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎదుట శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు బయలుదేరిన నిరుద్యోగులు, ప్రతిపక్షాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా మారి నిరుద్యోగులపై ఉక్కుపాదం మోపి వారి నోరునొక్కాలని చూస్తుందన్నారు. నిరుద్యోగులకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగుల గొంతులను నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే సమయం దగ్గరలోనే ఉందన్నారు.

# గనుల వేలంపై కన్నెర్ర

నస్పూర్‌లోని కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఏఐటీయూసీ నాయకులు

- కార్మిక వాడల నుంచి కదిలిన దండు
- కలెక్టరేట్‌ల ముట్టడి.. వామపక్షాల మహాధర్నా
- గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 5 : సింగరేణి బొగ్గు గనుల వేలంపై కార్మిక లోకం కన్నెర్రజేసింది. వామపక్ష పార్టీలు, సింగరేణి కార్మిక సంఘాలతో కలిసి గర్జించింది. నాలుగు జిల్లాల్లోని కలెక్టరేట్‌ల ఎదుట మహాధర్నాకు దిగింది. ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని, బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని, సింగరేణికే ఆ గనులను కేటాయించాలని డిమాండ్ చేసింది. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కలవేన శంకర్, సీతారామయ్య, చంద్రశేఖర్, దాసు, లక్ష్మణ్, బాజీ సైదా, కిషన్ పాల్గొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, గొడిసెల కార్తీక్, రాజేందర్, టీకానంద్, మాలశ్రీ, నిఖిల్, కృష్ణామాచారి పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రి ఉండి కూడా వేలం వేయడం సిగ్గు చేటని వారు మండిపడ్డారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ, సీపీఎంఎల్, సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, సీపీఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జగన్‌సింగ్, సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకట్‌నారాయణ, వామపక్షపార్టీల వివిధ కమిటీ సభ్యులు తొడసం భీంరావు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, ఆర్.మంజుల, బొజ్జ ఆశన్న, లంకజమున, శకుంతల, పొచక్క, అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, ఇంద్రజ, అరుణ్, కుంటల రాములు పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు ఎస్ఎన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, నందిరామయ్య, రాజు, రాజన్న, హరిత, సురేశ్, రమేశ్ తదితరులున్నారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

### సింగరేణి భవన్ ఎదుట ధర్నా

సింగరేణిభవన్ ఎదుట జరిగిన ధర్నలో ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్

రెబ్బెన, జూలై 5 : తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్ ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

### కొత్తగూడెంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నిరాహార దీక్ష

సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఆఫీస్ ముందు నిరాహార దీక్ష చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 5 : బొగ్గు బ్లాకుల వేలాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ హెడ్డాఫీస్ ఎదుట ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు ఆనందరావు ఆధ్వర్యంలో దళిత, గిరిజన ఉద్యోగులు ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్, కార్యదర్శి నక్కా సుమన్, కోశాధికారి గోదారి మురళి పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, జూలై 5 : జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిర్వహిస్తున్న బందోబస్తు ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పటిష్టమైన నిఘా మధ్య భద్రపర్చామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఉన్నారు.

### ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం

మంచిర్యాల అర్బన్, జూలై 5 : ప్రభుత్వదవాఖానల్లో మెరుగైన సేవలు అందుతున్నాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆర్ఎంవో భీష్మతో కలిసి పరిశీలించారు. ఆటో యూనియన్ నాయకులతో కలిసి దవాఖాన ఆవరణలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు మెరుగైన సేవలను అందించేందుకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టులు డా.అలివేణి, డా.కీర్తి, తదితరులు ఉన్నారు.

## పదేళ్ల బాబుకి పాముకాటు

- ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న బాలుడు
- ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల వేడుకోలు

ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాలుడు జాన్సన్

చిన్నారి జాన్సన్(ఫైల్)

మందమర్రి, జూలై 5 : పేగుబంధాన్ని చూసి ఆ తల్లి మురిసిపోయింది. పురిటి నొప్పుల బాధ మరిచిపోయింది. ఇంతలోనే విధి వెంటాడింది. ఈ నెల 2న ఆ బాలుడు పాము కాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొం దుతుండగా, ఆమె గుండెలవిసేలా రోదిస్తున్నది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో చోటు చేసుకున్నది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు గాంధీనగర్‌కు చెందిన మల్యాల శ్రీనివాస్ బిల్డింగ్‌లకు సున్నాలు వేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన కూతురు కీర్తిని రెండేళ్ల క్రితం చెన్నూర్‌కు చెందిన జీవన్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. తొలి కాన్పుకోసం తల్లిగారింటికి వచ్చిన కీర్తికి మగబిడ్డ పుట్టాడు. జాన్సన్‌గా నామకరణం చేశారు. జీవన్‌కుమార్-కీర్తి దంపతులు ప్రస్తుతం సీసీసీలో నివాసముంటున్నారు. వారం క్రితం గాంధీనగర్‌కు వచ్చారు. మంగళవారం రాత్రి 10 నెలల బాలుడు జాన్సన్‌తో కలిసి ఇంట్లో నేలపై నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు చిన్నారి జాన్సన్‌ను హుటాహుటిన మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కూలీ..నాలీ చేసుకొని బతికేటోళ్లమని, చేతిలో చిల్లిగవ్వ లేక అష్టకష్టాలు పడుతున్నామని, దాతలెవరైనా ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు. 7993411825, 623188 45 201 నంబర్లకు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయమందించాలని కోరుతున్నారు.

## డీఈపై చర్యలు తీసుకోవాలి

- ఇరిగేషన్ కార్యాలయ అటెండర్ల డిమాండ్
- ఆఫీస్‌కు తాళం వేసిన నిరసన

ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అటెండర్లు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 5 : ఇరిగేషన్ డీఈపై చర్యలు తీసుకోవాలని ఆ కార్యాలయ అటెండర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 3న కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించే దేవిదాస్‌ను ఇరిగేషన్ డీఈ రవికాంత్ పోలీసులతో కొట్టించి చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించారు. ఏదైనా జరిగితే బాధ్యులెవరని దేవిదాస్ భార్య లహరి ప్రశ్నించారు. దాదాపు గంట వరకు నిరసన చేపట్టి.. ఆపై ఎస్సీ డీవీ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
- మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679